www.epapersamayam.com APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

STV SAMAYAM

www.epapersamayam.com APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జిలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 207 ఎడిటర్ : విక్రం కుమార్ ఆదివారం 06 ఏప్రిల్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## రక్షణ సహకారానికి 'సప్తపది'

- ఏడు ఒప్పందాలపై భారత్-శ్రీలంక సంతకాలు
- మోదీకి అత్యున్నత 'మిత్ర విభూషణ' పురస్కారం



కొలంబో: రక్షణ రంగంలో బంధా లను బలోపేతం చేసుకునే వ్యవస్థను రూపొం దించడానికి తొలిసారిగా భారత్‌శ్రీలంక ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రెండు దేశాల భద్రత పరస్పర ఆధారితమని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

తరువాయి 2లో

## ఏఐ ఫేక్ కంటెంట్‌తో... పెనుముప్పు

- దానిపై విచారణ కోసం కోర్టుకు విజ్ఞప్తి చేయాలి
- సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలి
- కంచ గచ్చిబౌలి భూములపై సమీక్ష సందర్భంగా
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**సమయం న్యూస్, హైదరాబాద్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో వ్యాప్తి చేసే ఫేక్ కంటెంట్ (తప్పుడు సమాచారం) కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారుల్ని ఆదేశించారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్

తరువాయి 2లో





## భద్రాద్రిలో నేడు సీతారామ కల్యాణం

- ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్
- భద్రాచలం-న్యూస్‌టుడే,ఈనాడు-హైదరాబాద్

**సమయం న్యూస్, భద్రాచలం:** భద్రా చలం సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామితో పాటు పలువురు దాతలు, భక్తులు సీతారాములవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దేవాదా యశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఈఓ రమాదేవి పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కల్యాణ మహోత్సవం ఉంటుంది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధ్రువమూర్తుల కల్యాణం జరపనున్నారు. అనంతరం

తరువాయి 2లో

## ఉప ఎన్నికలు వస్తాయి.. సిద్ధంగా ఉండాలి...

- బాసు హనుమంతు నాయుడు కు సూచించిన బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

2లో





## చరిత్రను మార్చబోతున్న పీ4

- ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు
- మార్గదర్శుల భరోసాతో నమ్మకం పెరిగింది
- బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దుతాం
- బాబూజగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతి
- ముప్పాళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన

2లో

## హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి సరికాదు

- రాష్ట్ర పరువు, ప్రతిష్ఠలను దిగజార్చింది
- భారాస అధినేత కేసీఆర్

**సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థుల పోరాటాన్ని భారాస అధినేత కేసీఆర్ అభినందించారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఈ వర్సిటీలో చదువుకునేందుకు వస్తుంటారని.. అంతటి ఖ్యాతి ఉన్న విశ్వవిద్యాలయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని తప్పుపట్టారు. అధికారం చేతిలో ఉంది

తరువాయి 2లో





## రాజధానికి అభివృద్ధి హారమే

- రూ.30 వేల కోట్లతో హైదరాబాద్ ప్రగతికి ప్రణాళిక
- రూ.7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ...
- కొనసాగుతున్న టెండరు ప్రక్రియ
- మే నెలలో పెద్ద ఎత్తున పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు

**సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ), హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథార్టీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర పనులు త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. రూ.30 వేల కోట్లకు పైగా విలువ చేసే పనులు టెండరు ఆమోదం, టెండరు ప్రక్రియ చేపట్టే దశలలో

తరువాయి 2లో

## 6 నిమిషాలకో జవాబుపత్రం..!

- ఒక్కో అధ్యాపకునికి రోజుకు 45 నుంచి 60 వరకు అందజే
- హడావుడిగా మూల్యాంకనం
- ఇంటర్ విద్యార్థులతో బోర్డు చెలగాటం

**సమయం న్యూస్, హైదరాబాద్:** విద్యార్థులతో ఇంటర్ బోర్డు చెలగాటమాడుతోందా? గతంలో జరిగిన తప్పిదాల నుంచి గుణపాఠం నేర్చుకోవడం లేదా? ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం తీరు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలోని పలు స్పాట్ కేంద్రాల్లో ఒక్కో అధ్యాపకునికి (ఎగ్జామినర్) రోజుకు 30 బదులు 4560 జవాబు పత్రాలు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని కొందరు అధ్యాపకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో మార్చి 10 నుంచి విడతల వారీగా మూల్యాంకనం మొదలైంది.

తరువాయి 2లో

TELANGANA STATE BOARD OF INTERMEDIATE EDUCATION HYDERABAD

## భద్రాచలంలో వైభవంగా ధ్వజారోహణం

2లో



www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక



# భద్రాద్రిలో నేడు సీతారామ కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

కల్యాణమూర్తులను అలంకరించి ఊరేగింపుగా మిథిలా మండపానికి తీసుకెళ్తారు. అక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. భద్రాచలంలో ఆదివారం జరిగే కల్యాణ మహోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. ఆయన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఉదయం 8.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి భద్రాచలానికి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు ఆలయానికి చేరుకుని, భద్రాద్రి రామయ్యను దర్శించుకుంటారు. ఆ తర్వాత మిథిలా మండపంలో జరిగే కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు బూర్గంపాడు మండలం సారపాకలో ఓ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి.. భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2.15 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అవుతారు.

# ఏఐ ఫేక్ కంటెంట్‌తో పెనుముప్పు

(మొదటిపేజీ తరువాయి)

తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని సూచించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను లాక్కున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో కృత్రిమంగా వివాదం సృష్టించారంటూ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి కార్యాచరణపై అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు.

ఇలాంటి వాటిని అడ్డుకునేందుకు రాష్ట్రంలో సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అందుకోసం అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సీఎం సూచించారు.

**ఆ భూముల్లో 25 ఏళ్లుగా ఎన్నో భవనాలు**

'కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని భూముల్లో గత పాతికేళ్లుగా అనేక ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు భవనాలు, అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారు. అప్పుడు ఎలాంటి ఆందోళనలు జరగలేదు. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు లేనేలేవు. అదే సర్వే నంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైంది?' అంటూ సమావేశంలో చర్చ జరిగింది. 'నెమళ్లు ఆర్తనాదాలు చేసినట్లు ఆడియోలు.. బుల్డోజర్ల ధాటికి జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారుచేశారు. వీటిని కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయస్థాయిలో చర్చకు దారితీసింది. వాస్తవాలు వెల్లడించేలోగానే అసత్యాలు వైరల్ కావడం ప్రభుత్వానికి సవాలుగా మారింది' అని అధికారులు సీఎంకు వివరించారు.

**ప్రజాస్వామ్యానికే పెనుసవాలు**

'ఏకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహాం, దియా మీర్జా, రవీనాటాండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా వ్యాపించిన ఫేక్ ఫొటోలు, వీడియోలనే నిజమని నమ్మి.. పోస్టు చేయడం ద్వారా సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారు' అని చర్చ జరిగింది. ఈ భూములపై మొదట ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్‌ఝా కొద్దిసేపట్లోనే తన పోస్టును తొలగించి క్షమాపణలు చెప్పినా.. మిగతా ప్రముఖులు అదే ఫేక్ వీడియోను ప్రచారం చేశారు' అని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచ గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశం అభిప్రాయపడింది. పాకిస్థాన్, చైనా సరిహద్దు వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఇదే తీరుగా ఫేక్ కంటెంట్ సృష్టిస్తే ప్రమాదకరమన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారిలాంటివని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

# ఉప ఎన్నికలు వస్తాయి.. సిద్ధంగా ఉండాలి...

సమయం న్యూస్, హైదరాబాద్ : 10 నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు....బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో.. ఉమ్మడి మహబూబ్ నగర్,నల్గొండ, ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో శనివారం సమావేశం అయ్యారు...ఆ సన్నాహక సమావేశానికి పార్టీ ముఖ్య నేతలతో కలిసి గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు గారు పాల్గొన్నారు... ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు కు కేసీఆర్ పలు అంశాలను సూచించారు... పార్టీ ఫిరాయించిన 10 నియోజకవర్గాలో భాగంగా గద్వాల నియోజకవర్గానికి కూడా ఉప ఎన్నికలు వస్తాయని,అని విధాలుగా సిద్ధంగా ఉండాలని బాసు హనుమంతు నాయుడు కు కేసీఆర్ సూచించారు.. నియోజకవర్గంలో పార్టీ పూర్తి బాధ్యతలు మీరే వహించాలని వారు తెలిపారు... ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ కు గద్వాల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించే బాధ్యత నీదేనని కేసీఆర్ చెప్పారు...

# 6 నిమిషాలకో జవాబుపత్రం..!

(మొదటిపేజీ తరువాయి)

**సాధారణంగా 30 ఆన్సర్ షీట్లను దిద్దాలి**

ప్రతి రోజూ ఎగ్జామినర్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేయాలి. మధ్యాహ్నం గంటపాటు భోజన విరామం ఉంటుంది. అంటే గంటకు అయిదు... ప్రతి 12 నిమిషాలకు ఒకటి చొప్పున... 30 ఆన్సర్ షీట్లను దిద్దాల్సి ఉంటుంది. 'ఒక్కో ఎగ్జామినర్‌కు రోజూ 45 ఇస్తున్నారు. రసాయనశాస్త్రంలో 60 ఇస్తున్నారు. అన్ని పేపర్లు సక్రమంగా చూసి దిద్దడం చాలా కష్టం. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటమే' అని వరంగల్ ఎల్‌బీ కళాశాలలో స్పాట్‌కు హాజరవుతున్న ఒక అధ్యాపకుడు 'ఈనాడు'తో అన్నారు.

**ఠంచన్‌గా 10 గంటలకు సీట్లో కూర్చొని...**

రోజుకు 60 పేపర్లు ఇస్తే గంటకు 10 పేపర్లు దిద్దాలి. 24 పేజీల బుక్‌లెట్‌లోని జవాబులను పరిశీలించి... మార్కులు వేసి... మొత్తం లెక్కించే ప్రక్రియను సగటున కేవలం ఆరు నిమిషాలలోనే ముగించాల్సి ఉంటుంది. అదీ ఒక్క నిమిషం కూడా తేడా లేకుండా ఠంచన్‌గా 10 గంటలకు సీట్లో కూర్చొని.. ఒక్కసారి కూడా మూత్ర విసర్జనకు పోకుండా... టీ తాగకుండా ఉంటేనే సాధ్యం. అలా ఎక్కడైనా జరుగుతుందా అన్నది ప్రశ్నార్థకం. 'వరంగల్ కేంద్రంలో ఆంగ్లం సబ్జెక్టు మూల్యాంకనం ఈనెల 4న ముగిసింది. అయితే 8న రిలీవ్ అయినట్లుగా చూపుతూ ఉత్తర్వు కాపీలు ఇచ్చారు' అని ఆంగ్లం ఉపాధ్యాయుడు ఒకరు చెప్పారు.

# రాజధానికి అభివృద్ధి హారమే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. ఒప్పందాలు పూర్తి చేసుకొని మే నెలలో ఈ పనులన్నీ ప్రారంభించడానికి పురపాలక శాఖ సన్నాహాలు చేస్తోంది. గోదావరి నుంచి 20 టీఎంసీల నీటి మళ్లింపు సహా ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, ఫ్లైఓవర్లు ఇలా అనేక పనులను చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం గత ఏడాది, ఈ ఏడాది ప్రారంభంలో పరిపాలనా అనుమతులు ఇచ్చింది. పనులను ప్యాకేజీల వారీగా విభజించింది. అంచనాల తయారీ, టెండర్లు పిలవడం ప్రారంభమైంది. కొన్ని టెండరు దశ దాటి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. మరికొన్ని టెండరు ప్రక్రియ దశలో ఉన్నాయి.

* **గోదావరి నీటిని మళ్లించేలా**

రాజధానిలో అవుటర్ రింగ్ రోడ్ వరకు తాగునీటిని సరఫరా చేయాల్సిన హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్... రానున్న సంవత్సరాల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని మళ్లించాలని నిర్ణయించి రూ.7,360 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి రూ.5,400 కోట్లతో టెండర్లు పిలిచింది. ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. పది రోజుల్లో సీవోటీకి వెళ్తాయి. మే మొదటి వారం నుంచి పనులు ప్రారంభించాలన్నది లక్ష్యం. యాన్యుటీ మోడల్‌లో ఈ పనులను చేపడతారు. 40 శాతం మెట్రోవాటర్ బోర్డు భరిస్తే, మిగిలిన 60 శాతం గుత్తేదారులు రుణాల ద్వారా తీసుకొంటారు. 10.3 శాతం వడ్డీ. గతంలో కంటే 2.2 శాతం వడ్డీని తగ్గించినట్లు, నేషనల్ హైవే వారు చెల్లించే ఫార్ములానే ఇక్కడ వినియోగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పది సంవత్సరాల నిర్వహణ బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదే.

* **అమృత్ పథకం కింద 39 ఎస్‌టీపీలు**

అమృత్ పథకం కింద 39 ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టారు. వీటి విలువ రూ.3,800 కోట్లు. ఇందులో కొన్నింటికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.

* **ఎలివేటెడ్ కారిడార్లకు రూ.5,106 కోట్లు**

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.5, 106 కోట్లతో రెండు ఎలివేటెడ్ కారిడార్ల పనులకు గత ఏడాది నవంబరులో పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు (జాతీయ రహదారి 44తో) రూ.1,487 కోట్లతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పని ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. ఈ పనిని ఈపీసీ పద్ధతిలో చేపట్టనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓ.ఆర్.ఆర్ వరకు (రాష్ట్ర రహదారి 01తో) రూ.3,619 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనికి టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పనిని కూడా ఈపీసీ పద్ధతిలో చేపట్టనున్నారు.

* **ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ...**

జీహెచ్ఎంసీ పరిధిలో రూ.7,032 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ముగ్ధ జంక్షన్, ఫిల్మ్‌నగర్ జంక్షన్, మహారాజ అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కాజాగూడ జంక్షన్, ఐటీ జంక్షన్ వద్ద మల్టీలెవల్ ఫ్లైఓవర్లు, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్ వరకు రోడ్ల విస్తరణ, ఇంకా పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు, ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కూడా పలు పనులు చేపట్టనున్నారు.

* **రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు..**

రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని రూ.4,500 కోట్లతో చేపట్టనున్నారు. గతంలో చేయని లింకు రోడ్లకు (మిస్సింగ్ లింక్ రోడ్లకు) మరో రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పురపాలక శాఖ వర్గాలు తెలిపాయి. మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. డీపీఆర్ తయారీ జరుగుతోంది. మరో రెండుమూడు నెలల్లో కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్ అందజేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంబంధిత అధికారులతో, కన్సల్టెన్సీ సంస్థతో తరచూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమై సమీక్షిస్తున్నారు. బడ్జెట్‌లో కూడా రూ.1,500 కోట్లు కేటాయించారు. మొత్తం మీద పురపాలక శాఖ ఆధ్వర్యంలో మే నెల నుంచి రూ.30వేల కోట్లకు పైగా పనులు ప్రారంభమవుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

కదాని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిని న్యాయస్థానాలు, సమాజం తిప్పి కొడుతున్నాయన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన భారాస శ్రేణులను కేసీఆర్ అభినందించారు. పార్టీ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

"భారాస పాలనలో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిపాం. దీన్ని నిలుపుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది. హెచ్‌సీయూ భూముల విషయంలో దుందుడుకు చర్యలతో దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువు, ప్రతిష్ఠలను దిగజార్చేలా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను ఉద్యమ స్ఫూర్తి ఉన్న భారాస మాత్రమే అర్థం చేసుకోగలదు. కాంగ్రెస్ పాలన తీరుతో భారాస చిత్తశుద్ధి ఏంటో ప్రజలకు అర్థమైంది. సాగు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది.

* **వ్యతిరేక శక్తుల మోసపూరిత వాగ్దానాలతో..**

భారాస ప్రభుత్వ హయాంలో కుల వృత్తులకు స్వర్ణయుగంగా ఉండేది. రైతులకు పెట్టుబడి అందించిన మొట్ట మొదటి సర్కారు భారాస ప్రభుత్వమే. రైతు వేలిముద్ర పెడితే తప్ప భూమి మరొకరికి బదిలీ కాకుండా ధరణి ద్వారా రక్షణ కల్పించాం. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చుకున్నాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 20 వేల మెగావాట్లకు పెంచాం. తెలంగాణ వ్యతిరేక శక్తులు మోసపూరిత వాగ్దానాలతో ఆశలు రేకెత్తించి అధికారం చేజిక్కించుకున్నాయి. పాలించడం చేతకాక భారాస పాలనను తప్పుపడుతున్నారు'' అని కేసీఆర్ పేర్కొన్నారు. వరంగల్ రజతోత్సవ సభ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు డా.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, కోటిరెడ్డి, నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, జోగినిపల్లి సంతోష్, గ్యాదరి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను మార్చబోతున్న పీ4

అమరావతి: సమాజంలో ఆర్థికంగా ఎదిగినవాళ్లు.. పేదలను తమ కుటుంబసభ్యుల్లా భావించి పైకి తీసుకొస్తామని భరోసా ఇవ్వడం చూస్తుంటే పీ4 కార్యక్రమం కచ్చితంగా విజయవంతం అవుతుందనే నమ్మకం కలిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలనకు ప్రపంచంలోనే ఎక్కడా ఇలాంటి ప్రయోగం జరగలేదన్నారు. ఇది చరిత్రను తిరగరాసే కార్యక్రమం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పాల్గొన్నారు. పీ4 అమలులో భాగంగా ప్రజావేదికపై గ్రామంలోని 41 బంగారు కుటుంబాలు, వారిని ఆదుకునేందుకు వచ్చిన మార్గదర్శులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలపై బాబూ జగ్జీవన్‌రామ్ చిన్నతనం నుంచే పోరాడారన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, ఫులె.. వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకెళుతున్నామని చెప్పారు. దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. వైకాపా పాలకుల దెబ్బకు సర్వనాశనమైన రాష్ట్ర పరిస్థితిని.. ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన తొమ్మిది నెలల్లోనే గాడిన పెట్టగలిగామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

* **20 లక్షల బంగారు కుటుంబాల ఎంపిక**

'రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను ఎంపిక చేశాం. పేదరికంలో ఉన్న వీరందరినీ ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మార్గదర్శులకే అప్పగిస్తూ పీ4ను రూపొందించాం. రాష్ట్రంలోని ఏ వ్యక్తీ పేదరికంతో ఉండకూడదు. ఒకవైపు ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలను దేశంలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తూనే.. అభివృద్ధికి బాటలు వేస్తున్నాం. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, తీవ్ర అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల సామాజిక భద్రతా పింఛను ఏ రాష్ట్రంలోనూ లేదు.

* **20-30 ఏళ్ల దూరదృష్టితో ఆలోచిస్తా**

నేను సమాజాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ 2030 ఏళ్ల దూరదృష్టితో ప్రణాళికలు రూపొందిస్తూ.. కొత్త ఆలోచనలను అమలు చేస్తుంటాను. పీ4 కార్యక్రమం కూడా ఇలాంటిదే. నా ఆలోచనలు అర్థం చేసుకున్నవాళ్లు వాటిని అందిపుచ్చుకుని బాగుపడుతుంటారు. అర్థంకాని వారు అవకాశాలను కోల్పోతుంటారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్రగా అభివృద్ధి చేయడంతోపాటు.. ప్రజల ఆదాయ వనరులు రెట్టింపు చేయడమే నా లక్ష్యం. ముప్పాళ్లలో అభివృద్ధి పథకాల శిలాఫలకాలను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో సత్యకుమార్, కేశినేని శివనాథ్, తంగిరాల సౌమ్య, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

* **పిల్లలు లేకుంటే ఊళ్లే ఉండవు**

జనాభాను పెంచండి. ప్రస్తుతం జనాభా తగ్గే పరిస్థితి వస్తుంది. దీని వల్ల రాష్ట్రం నష్టపోతుంది. దంపతులు ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలకు జన్మనివ్వాలి. ప్రస్తుత అంచనాల ప్రకారం మరికొన్ని దశాబ్దాలకు జనాభా తగ్గిపోతుంది. అప్పుడు ఊళ్లలో పిల్లలు ఉండరు. అంతా ముసలివాళ్లే ఉంటారు. ఆ తర్వాత ఊళ్లే ఉండవు. ఆ పరిస్థితి రాకూడదనే జనాభా పెంచాలని పదేపదే చెబుతున్నా.

* **బాబూ జగ్జీవన్‌రామ్ సోలార్ పథకం**

బాబూ జగ్జీవన్‌రామ్ సౌరశక్తి పథకం కింద ఎస్సీలకు 2 కిలోవాట్ల సౌరవిద్యుత్తు ప్యానళ్లు ఇస్తాం. వచ్చే ఏడాది కాలంలో 20 లక్షల ఎస్సీ కుటుంబాలకు ఈ రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టిస్తాం. ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్ల కిందటే మద్దతిచ్చా. మళ్లీ నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వర్గీకరణ అమలు చేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం. ఎస్సీల సంక్షేమం కోసం 27 పథకాలను తెదేపా ప్రభుత్వంలో అమలు చేస్తే.. గత పాలకులు వాటన్నింటినీ రద్దు చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ భరోసా కింద 11.38 లక్షల మంది ఎస్సీలకు పింఛన్లు అందిస్తున్నాం. వంద శాతం ఎస్సీ, బీసీల పిల్లలకు గురుకుల విద్యను అందిస్తాం.

* **నా రికార్డు అధిగమించడం కష్టం**

నేను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశా. తెలుగు రాష్ట్రాల్లో ఈ రికార్డు అధిగమించడానికి చాలా సమయం పడుతుంది. ప్రస్తుతం మా ప్రభుత్వం ముందు అనేక సవాళ్లున్నాయి. వాటన్నింటినీ అధిగమిస్తూ వెళుతున్నాం. ఒకవైపు రూ.10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కడుతూ.. మరోవైపు ఆదాయం పెంచుతూ.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పోలవరం, అమరావతి నిర్మాణం చేపట్టడం కొంచెం కష్టమే. అయినా ఇష్టంగా చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, కలెక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు.

# రక్షణ సహకారానికి 'సప్తపది'

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొన్న ఆయన అక్కడి నుంచి శుక్రవారం రాత్రి నేరుగా శ్రీలంకకు చేరుకున్నారు. కొలంబోలోని చారిత్రక ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు కుమార దిసనాయకే శనివారం ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ ఓ విదేశీ ప్రభుత్వాధినేతకు స్వాగతం లభించడం ఇదే ప్రథమం. దిసనాయకేతో చర్చల అనంతరం వారి సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. యూఏఈతో కలిసి ట్రింకోమలీని ఇంధన కేంద్రంగా [redacted] ద్వారా అనుసంధానత వంటివి దీనిలో ఉన్నాయి. రుణాల పునర్వ్యవస్థీకరణకూ భారత్ ఆమోదం తెలిపింది.

* **మత్స్యకారుల్ని వదిలిపెట్టండి**

రెండు దేశాల మధ్య మత్స్యకారుల వివాదాలకు మానవతా దృక్పథంతో పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. శ్రీలంక నిర్బంధంలో ఉన్న మత్స్యకారుల్ని, [redacted] వెంటనే విడుదల చేయాలని కోరారు. శ్రీలంకలోని తమిళ నేతల బృందంతోనూ మోదీ విడిగా భేటీ అయ్యారు. భారతదేశ భద్రత ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని ఏ రూపంలోనైనా వాడుకునేందుకు ఏ దేశాన్నీ అనుమతించేది లేదని దిసనాయకే స్పష్టంచేశారు. చర్చల అనంతరం ఇద్దరు నేతలు కలిసి సంపూర్ సౌర [redacted] ప్రారంభించారు. శ్రీలంక అత్యున్నత పురస్కారమైన మిత్ర విభూషణ అవార్డును మోదీకి దిసనాయకే ప్రదానం చేశారు. ఇది 140 కోట్లమంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు భారత ప్రధాని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో మోదీ కృషికి గుర్తింపుగా దీనిని అందజేశారు.



## నియోజకవర్గంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**అంబర్‌పేట, ఏప్రిల్ 5, సమయం న్యూస్:** బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా అంబర్ పేట శాసనసభ్యులు శ్రీ కాలేరు వెంకటేష్ గారు బాగ్ అంబర్ పేట డివిజన్ భరత్ నగర్ కమిటీ హాల్ లో నిర్వహించిన బాబు జగ్జీవన్ గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గోల్నాక డివిజన్ లో అంబర్ పేట కార్పొరేటర్ శ్రీ విజయకుమార్ గౌడ్ గారు మరియు కార్పొరేటర్ శ్రీమతి అమృత గారితో కలిసి గోల్నాక చౌరస్తా లో ఉన్న వారి యొక్క విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# బాబూ జాగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**అంబర్ పేట, ఏప్రిల్5, సమయం న్యూస్:** బర్కత్ పుర బిజెపి కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాహుల్ చంద్ర గారు వర్కాల శ్రీకాంత్ గారి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ గారి 117వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి గారు పాల్గొని మాట్లాడారు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షులు దీపక్ రెడ్డి గారు మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు గారు మాజీ ఎమ్మెల్యే చింతల రామచందర్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి బంగారు



శృతి గారు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ప్రసాద్ అన్న గారు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్ గారు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు రమేష్ యాదవ్ గారు నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ అమృత గారుఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు నాగేష్ గారు సికింద్రాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ అజయ్ కుమార్ గారు జూబ్లీహిల్స్ అసెంబ్లీ కరీంనగర్ గంగరాజు గారు ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రామస్వామి గారు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ గారు లక్ష్మణ్ గారు శ్రీనివాస్ గారు కార్యదర్శి కె రామచందర్ గారు ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు నగర ఎస్సీ మోర్చా నాయకులు బిజెపి రాష్ట్ర నగర నాయకులువివిధ మోర్చానాయకులు డివిజన్లో ఎస్సీ మోర్చాఅధ్యక్షులు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు



## బోధన్ మండలంలో వరి పంట కోత ప్రయోగం పరిశీలన

**బోధన్ మండలం, 5 ఏప్రిల్, సమ యం న్యూస్ :** బోధన్ మండల ప్రణాళిక, గణాంక అధికారి (MPSO), బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన వరి పంట కోత (CC ప్రయోగాన్ని శనివారం రోజున సబ్‌కలెక్టర్ వికాస్ మహతో బోధన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ (DySO), గ్రామ పెద్దలు కూడా పాల్గొన్నారు. పరిశీలన సమయంలో సబ్‌కలెక్టర్ వికాస్ మహతో పంట నాణ్యత, కోత పద్ధతులు, రైతుల అభిప్రాయాలను సమీక్షించారు. రైతుల ఉత్పత్తి సామర్థ్యం పెరగడం, పంట కోత ప్రక్రియలో ఆధునిక పద్ధతులను అమలు చేయడంపై ముఖ్యమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ ప్రయోగం లక్ష్యం రైతులకు పంట కోతలో మెరుగైన పద్ధతులు పరిచయం చేయడం, ఉత్పత్తి పెరుగుదల సాధించడం. సబ్‌కలెక్టర్, DySO, సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పెద్దల హాజరుతో ఈ కార్యక్రమం గొప్ప విజయాన్ని సాధించింది.

## బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో పాల్గొన్నా ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు, అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ గారితో కలిసి బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి సందర్భంగా అంబర్ పెట్ నియోజకవర్గం గోల్నాక చౌరస్తాలో జగ్జీవన్ రామ్ గారి విగ్ర హానికి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వతంత్ర సమరయోధుడు గొప్ప సంఘసంస్కర్త రాజకీయవేత్త బీహార్ లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చినటువంటి మహోన్నతమైనటువంటి నేత భారత పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే



కాకుండా ఉప ప్రధానిగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్కే బాబు,రెడ్డపాక రాము, భూపతి లక్ష్మణ్,చెందు, మహేష్ ముదిరాజ్,అరుణ్ కుమార్, మిరియాల రవీందర్, సురేష్, రమేష్, సంతోష్ చారి, వివిధ పార్టీల నాయకులున్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**వెల్దుర్తి ఏప్రిల్ 5,సమయం న్యూస్:** దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, ఆలు పెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని వెల్దుర్తి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయం లో బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ 05 ఏప్రిల్ 1908 వ సంవత్సరంలో బీహార్ లోని వెనుకబడిన కులంలో పేద కుటుంబంలో జన్మించారు. పేరొందిన స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, రాజకీయవేత్త, బీహార్ లోని వెనుకబడిన కులంలో పుట్టిన బాపూజీగా ఆయన ప్రసిద్ధి చెందారు. భారత పార్లమెంట్లో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించాడు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమై ఆల్ ఇండియా డిప్రెషన్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించరు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారు. తరువాత గ్రామీణ, కార్మిక ఉద్యమాన్ని నిర్వహించి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి వారిలో



ఉద్యమ స్ఫూర్తిని నింపారు. అటువంటి మహనీయుని మననం చేసుకొని మన మందరం మంచిగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.



ఆదివారం శ్రీరామ నవమి సందర్బంగా. మధ్యాహ్నం 3:00 గంటలకు అంబర్ పేట్ మునిసిపల్ గ్రౌండ్ నుండి ప్రారంభం అయ్యే శ్రీరామ నవమి శోభయాత్రకు. శ్రీరామ నవమి ఉత్సవ సమితి సభ్యులు ఈ రోజు అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ గారిని కలిసి ఆహ్వాన పత్రికను ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. అనంతరం హిందూ సోదరులకు అందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రంలో నరేంద్ర ముదిరాజ్, సాయి, కాశి రెడ్డి పాల్గొన్నారు.

- అంబర్ పేట, ఏప్రిల్ 5, సమయం న్యూస్:



## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు

**అంబర్ పేట, ఏప్రిల్ 5, సమయం న్యూస్:** నల్లకుంట డివిజన్ లో సుమారుగా 09 లక్షల రూపాయల నిధులతో సివరేజ్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ ఈ రోజు అంబర్ పేట ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి వై. అమృత గారితో కలిసి స్ట్రీట్ నంబర్ 4 లో సుమారుగా 9 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే గారు కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానిక కాలని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ ను విజయవంతం చేయాలి

**రాయపోల్, ఏప్రిల్ 05:** ఈనెల 27న గౌరవ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పిలుపుమేరకు వరంగల్ లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయలని టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు గారి పిలుపుమేరకు మన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు వరంగల్ లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి సుమారుగా 100 మంది తరలిరావాలని అన్నారు రాబోయే రోజుల్లో మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ మాజి జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాజీ కోఆప్షన్ పర్వేజ్ బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ కల్లూరు శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షుడు వెంకట్ గౌడ్ మాజీ ఎంపిటిసి రాజు గౌడ్ నవీన్ గౌడ్ భార్గవ్ శ్రీధర్ మురళి చింతకింది మహేష్ తదితరులు పాల్గొన్నారు.





ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డు గ్రహీత జెస్సీరాజ్ సీఎం చంద్రబాబు నాయుడు గారిని సచివాలయంలో కలిశారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ తైవాన్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌ను జెస్సీరాజ్ సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జెస్సీరాజ్ సీఎంను కలవగా అభినందించారు.

## సంపాదకీయం

# రామో విగ్రహవాన్ ధర్మః

రామో విగ్రహావాన్ ధర్మః అన్నారు. అంటే మూర్తీభవించిన ధర్మస్వరూపుడు శ్రీరామచంద్రుడు. మానవుడు ఎలా నడుచుకోవాలో..ఎలా ఉండాలో చెప్పిన మార్గమే రామాయణం. వాల్మీకి మహర్షి రామాయణం కావ్యాన్ని అందించి ప్రపంచానికి మార్గం చూపిన మహానుభావుడు. రాముడు ఎంతగొప్పవాడో... రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి కూడా అంతే గొప్పవడాని చెప్పాలి. భూమ్మీాద రాముడు మానవుడిగా నడయాడి ధర్మాన్ని ఆచరించి చూపిన మహానుభావుడు. అందుకే మహాత్ముడైన రాముడి నడక నేటికీ అనుసరణీయంగా మారిందని చెప్పుకుంటుంటాం. అవతార పురుషుడుగా, మానవాళికి మంచి మార్గాన్ని చూపేందుకు మనిషి రూపంలో భూమి మీద జన్మించిన మహావిష్ణువు ఎందరికో ఇలువేల్పుగా నిత్యం నీరాజనాలందుకుంటున్న వాడు శ్రీరామ చందప్రభువు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు మానవుడిగా అవతరించిన అవతారం రామావతారం. రామాయణ కాలాన్ని త్రేతాయుగంగా చెప్పుకుంటున్నా అది ఎప్పుడు జరిగిందన్నది ఇప్పటికీ లెక్క కట్టలేకున్నా, ఆ సీతారాములు మాత్రం నిత్యం మన ఇళ్లలో కొలువై ఉంటున్నారు. వాల్మీకి మహర్షి విరచిత రామాయణ మహాకావ్యానికి అంతటి ఉత్కృష్టత ఉంది. శ్రీమహావిష్ణువు పరిపూర్ణ మానవుడిగా దాల్చిన అవతారం శ్రీరామావతారం. మానవ రూపంలో భూమిపై అడుగుపెట్టిన ఆ దివ్యమూర్తి పురుషోత్తముడిగా ఎలా ఉండాలో ఆచరణలో చూపించాడు. చైత్ర మాసం నవమినాడు జన్మించిన శ్రీరాముడు ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా రామరాజ్యాన్ని నెలకొల్పాడు. రామాయణం సకల ధర్మాలకు నిధి. రామాయణ కథానాయకుడు ధర్మాలన్నీ మూర్తీభవించినట్టున్న శ్రీరామచంద్రుడు. ఇంతటి సకల ధర్మసారం కనుకనే రామాయణం నేటికీ ధర్మాలన్నిటికీ ప్రామాణిక మైంది.వాల్మీకి శోకంతో చెప్పిన శ్లోకం ఛందోబద్ధ మైనదని, దాన్ని అనుసరించి రామాయణ మహాకావ్యాన్ని రచించమని బ్రహ్మ అన్నాడు. లోకంలో పర్వతాలు, నదులు,సముద్రాలు ఉన్నంత కాలం రామాయణం విరాజిల్లుతూ శాశ్వత కీర్తిని సంపాదించుకొని ఉంటుందని చెప్పాడు. మహర్షి వాల్మీకి ఆదికవే కాక వేదాంతి, దార్శనికుడు, తపస్వి, ప్రజలకు మార్గదర్శకుడు కూడా. అలాంటి వాల్మీకి రామాయణ రచన కోసం బ్రహ్మ నుంచి ప్రేరణ పొందాడు. ఓ రోజున ఆయన శిష్యులతో కలిసి తమాసా నదీ తీరానికి స్నానం కోసం వెళ్లినప్పుడు క్రౌంచపక్షుల జంటలోని మగపక్షిని ఓ వేటగాడు బాణంతో కొట్టాడు. ఆ దెబ్బకు ఆ పక్షి కిందపడి ప్రాణాలను విడిచింది. ఆ దృశ్యాన్ని చూసిన మహర్షి హృదయం కరుణ రసంతో ద్రవించింది. కళ్లు చెమ్మగిల్లాయి. కంఠం గద్గదమైంది. వెంటనే 'మానిషాద' అనే శ్లోకం ఆయన నోటివెంట అప్రయత్నంగా వచ్చింది. మనసు ఎంతో కల్లోలమైంది. ఆ పరిస్థితులలో మరోసారి బ్రహ్మదేవుడు వాల్మీకికి ధైర్యం చెప్పి ఆశీర్వదించాడు. బ్రహ్మదేవుడి ఆ మాటలు వాల్మీకికి మరింత ప్రేరణనిచ్చాయి. ఆ వెంటనే ఆయన యోగాసీనుడై రామచరితంలోని ఘట్టాలను, దృశ్యాలను తన మనోనేత్రంతో చూడగలిగాడు. ఆ వెంటనే రామాయణ రచనకు అంకురార్పణ జరిగింది. ఆయనకు సంబంధించిన ప్రధానమైన పండుగ శ్రీరామనవమి. చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రంలో కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం పన్నెండు గంటలకు అభిజిత్ ముహూర్తంలో శ్రీరామచంద్రుడు జన్మించాడు. అందుకే ఈ పుణ్యదినాన్ని తరతరాలుగా శ్రీరామనవమి పండుగగా అందరూ నిర్వహించు కుంటున్నారు. అలాగే శ్రీరాముడి కళ్యాణం, రాముడు రావణుడిని జయించి అయోధ్యకు తిరిగి వచ్చింది కూడా నవమి నాడేనని పెద్దలు చెబుతారు. అందుకే నవమికి ప్రాధాన్యం ఏర్పడిరది. విశ్వామిత్రుడితో అరణ్యానికి వెళ్లిన రాముడు స్వయంవరంలో శివధనస్సును విరిచి సీతను పరిణయమాడాడు. శ్రీరాముడి వివాహం ఆహ్వానాన్ని తెలుసుకున్న దధరథుడు మిథిలకు ప్రయాణమయ్యాడు. చతురంగ బల సమేతుడై వశిష్ఠ వామ దేవ తదితర మహర్షులను వెంటపెట్టుకుని మిథిలానగరానికి చేరాడు. దశరథ మహారాజు ఆగమన వార్తను తెలుసుకుని జనక మహారాజు తన పురోహితుడైన శతానందుడిని వెంటపెట్టుకుని ఎదురు వెళ్లి సాదరంగా స్వాగతం పలికి ఆహ్వానించాడు. తన కుమార్తెను శ్రీరామచంద్రుడికి భార్యగా స్వీకరించమని అభ్యర్థించాడు. దశరథ మహారాజు ఎంతో సంతోషంతో తన సమ్మతిని చెప్పడంతో జనకుడి ఆనందానికి అవధులు లేవు. వెంటనే తన తమ్ముడైన కుశధ్వజుడిని పిలిపించి కల్యాణానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ త్వరితగతిన చేశాడు. దశరథ మహారాజు పురోహితుడైన వశిష్ఠ మహర్షి విశ్వామిత్రుడు అంగీకారాన్ని తీసుకుని దశరథ మహారాజు వంశ వృక్షాన్ని వివరించి చెప్పాడు. దశరథుడి వంశంలో బ్రహ్మ, మరిచీ, కశ్యపుడు, సూర్యుడు, మనువు, ఇక్ష్వాకుడు, దిలీపుడు, రఘువు లాంటి ఉత్తములు జన్మించారని, కనుక దశరథుడి వంశవృక్షం మహోన్నత మైందని వశిష్ఠుడు వివరించాడు. ఈ సందర్భంలో జనక మహారాజు వధువు పక్షం వారు వివాహ సమయంలో ఎంత వినమ్రంగా ఉంటారనటానికి చక్కని ఉదాహరణగా ప్రవర్తించాడు. తన వంశవృక్షాన్ని తానే స్వయంగా వివరించి చెప్పటంలో ఈ వినమ్రత కనుపిస్తుంది. తన వంశంలో నిమిచక్రవర్తి, మిధిచక్రవర్తి, జనకుడు, ఉదావసుడు, నంది వర్ధనుడు, హ్రస్వరోముడు, జనకుడు ఇలా వివరించారు. ఇలా తనవంశ వృక్షాన్ని స్వయంగా దశరథ మహారాజుకు వివరించాడు జనకుడు. ఈ విధంగా పరస్పరం వంశ వృక్షాల వివరణ అయిన తరువాత కల్యాణానికి అంతా సిద్ధమయ్యారు. శ్రీరామ చందప్రభువుకు సీతమ్మను, లక్ష్మణుడికి ఊర్మిళను భరతుడికి మాండవిని, శత్రుఘ్నుడికి శ్రుతకీర్తినిచ్చి వివాహం ఎంతో వైభవంగా జరిపించారు. ఆ తరవాత సీతాకళ్యాణం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అంతా సీతారాముల లాగా వైభవంగా వివాహ మహోత్సవం జరుపుకోవాలని, అంత నిరాడంబరంగా జీవించాలని కోరుకుంటారు. అందుకే రాముడు, సీత ఆదర్శ పురుషులయ్యారు. నిత్యం వారు మనకు ఆరాధ్యులు అయ్యారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

**అంబర్ పేట, ఏప్రిల్ 5, సమయం న్యూస్:** కంటోన్మెంట్ బోర్డ్ అధికారికంగా నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న స్థానిక పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారు మరియు కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ గారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి బి దేవేందర్ గారు మరియు సదకేశవ్ రెడ్డి గారు. కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా




పాల్గొన్న నర్మద మల్లికార్జున్ గారు దాంట్లో భాగంగా బొల్లారం లో నిర్వహించిన కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు కింజరాపు ప్రవీణ్ గారు, బాణాల శ్రీనివాస్ రెడ్డి గారు,శ్రీకాంత్ గారు,ధనుంజయ్ చారి గారి తో కలసి పాల్గొనటం జరిగింది. వార్డ్ 4 లో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు టోపీ శంకర్ గారు,రాజ్ మల్లేష్ గరు, విజయరామ రాజు గారు,అజయ్ గౌడ్ గారు మరియు ప్రతీక్ జైన్ గార్లతో కలసి పాల్గొనటం జరిగింది.

# నేటి యువతకు స్ఫూర్తి బాబు జగ్జీవన్ రామ్

- **నవభారత నిర్మాణంలో జగ్జీవన్ రామ్ కీలకపాత్ర**
- **సంఘసంస్కర్త జగ్జీవన్ రామ్ ను ఆదర్శంగా తీసుకోవాలి**
- **బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పలువురు వక్తలు**





కరీంనగర్, ఏప్రిల్ 5, సమయం న్యూస్ : స్వాతంత్ర పోరాటంలోనూ నవభారత నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించిన సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరీంనగర్ లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ చౌరస్తాలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాన కొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఎస్సీ ఎస్టీ సంఘాల నేతలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న వయసులో కేంద్ర మంత్రివర్గంలో అనేక పదవులు చేపట్టిన బాబు జగ్జీవన్ రామ్ భారత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. చదువు ద్వారానే జగ్జీవన్ రామ్ అంతటి కీర్తి సంపాదించారని, ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. ముఖ్యంగా యువత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని తెలిపారు. ఇందులో భాగంగానే రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కేంద్రం వద్ద బలంగా వినిపిస్తున్నామని అన్నారు. బలహీన వర్గాలు అభివృద్ధి చెందేలా 6 గ్యారంటీల అమలుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతూ ఉందని తెలిపారు. రానున్న అంబేద్కర్ జయంతి, జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆ మహనీయులకు నివాళులర్పించాలని కోరారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో, నవభారత నిర్మాణంలో బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని అన్నారు. చిన్న వయసులో కార్మిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి కీలక చట్టాలను అమలు చేశారని గుర్తు చేశారు. రక్షణ మంత్రిగా ఆయన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. జగ్జీవన్ రామ్ మార్గంలో పయనించిన ఆయన కూతురు మీరా కుమారి ప్రత్యేక తెలంగాణ బిల్లులో తన వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజల వైపు నిలబడిన జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన ఇందులో భాగమేనని తెలిపారు. దళితుల పక్షపాతిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉందని అన్నారు. జిల్లాలో దళితుల సమస్యలపై ముందుండి పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ చిన్న వయసు నుండి చదువుపై శ్రద్ధ పెట్టిన బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో కీలక పదవులు చేపట్టారని గుర్తు చేశారు. చదువు ద్వారానే ఆయనలో ప్రశ్నించే పోరాడే తత్వం వచ్చిందని తెలిపారు. 50 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు పార్లమెంటేరియన్ గా ప్రజాసేవ చేశారని అన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, రక్షణ, రైల్వే శాఖ మంత్రిగా వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. మహిళలు చదువుకోని రోజుల్లో తన కుమార్తె మీరా కుమారిని చదివించారని అన్నారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో మీరా కుమారి లోక్ సభ మహిళ మొదటి స్పీకర్ గా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేశారు. పేద విద్యార్థుల సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం ఎప్పుడూ శ్రద్ధ చూపుతూనే ఉందని అన్నారు. చదువుతోనే సమాజంలో సమానత్వం వస్తుందని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, భారత అభివృద్ధికి బాబు జగ్జీవన్ రామ్ పోరాటం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. అన్ని వర్గాల వారి హక్కులను ఆయన కాపాడారని తెలిపారు. వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలికారని అన్నారు. అంతకుముందు ఈనెల 14న నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ర్యాలీకి సంబంధించిన పోస్టర్ని ఆవిష్కరించారు. కులాంతర వివాహం చేసుకున్న ఐదు గురు దంపతులకు వివాహ ప్రోత్సాహక బహుమతి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారధి కళాబృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, ఎస్సీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఎస్సీ ఎస్టీ సంఘాల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



**దౌల్తాబాద్, ఏప్రిల్ 05 సమయం న్యూస్ :** ఈనెల 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తి లో జరిగే బిఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రహీముద్దీన్, దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో దౌల్తాబాద్ నాయకులతో సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అంటేనే ఉద్యమాల గడ్డ అని, నాటి తెలంగాణ పోరాటం నుండి నేటివరకు అడుగడుగునా బిఆర్ఎస్ కు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు.తెలంగాణ ఉద్యమంలో, ప్రత్యేక రాష్ట్ర సాధనలో, తెలంగాణ అభివృద్ధిలో బిఆర్ఎస్ పార్టీ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. 25 ఏళ్ల పార్టీ ఆవిర్భావ వేడుకలు పండుగలా నిర్వహించాలని కోరారు. బహిరంగ సభకు వెళ్లే ముందు అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి బయలుదేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, నాయకులు స్టీవెన్ రెడ్డి, యాదవ రెడ్డి, వెంకట్ రెడ్డి, చిక్కుడు సత్యనారాయణ, వేమ శ్రీనివాస్, సత్తయ్య, బండారు దేవేందర్, కలీలుద్దీన్, నాగరాజు, నర్సింలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

## వెల్దుర్తి మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

వెల్దుర్తి ఏప్రిల్ 5, సమయం న్యూస్: వెల్దుర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే వెల్దుర్తి మండల కేంద్రము లో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, చౌరస్తాలో, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి కార్యకర్తల సమక్షంలో బర్త్డే కేక్ కట్ చేశారు. అనంతరం నర్సాపూర్లో నిర్వహిస్తున్న సునీత రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొనటానికి వెల్దుర్తి మండల సీనియర్ బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వంచ భూపాల్ రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, ప్రతాప్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ రమేష్ చందర్ గుప్తా, జిల్లా నాయకులు పడిగె నర్సింలు , శ్రీనివాస్ రెడ్డి చల్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం




నిజామాబాద్, 5 ఏప్రిల్, సమయం న్యూస్ : నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, IPS., ఆదేశాల మేరకు నిజామాబాద్ కమీషనరేటు కార్యాలయంలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) ఎ.రామచంద్ర రావు, కీ॥శే॥ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు శనివారం రోజున ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి. సి. పి (ఎ.ఆర్) మాట్లాడుతూ భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 1908 సంవత్సరం,ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా చంద్వా గ్రామంలో జన్మించారనీ, అతడు ముట్టుకున్న కుండలో నీటిని తాగడానికి ఆధిపత్య కులాల విద్యార్థులు నిరాకరించడంతో మొదటిసారి అంటరానితనానికి గురయ్యాడు. సామాజిక, రాజకీయ, బానిసత్వం పై జీవితాంతం, యుద్ధం చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని, స్వరాజ్య ఉద్యమంతో పాటు దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన ఆయన జీవితం రాజకీయ, సామాజిక, చారిత్రక ప్రాధాన్యత కలిగినది అని అన్నారు. ఈ కార్యాక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సతీష్, రిజర్వు ఇన్స్ పెక్టర్స్ తిరుపతి (అడ్మిన్), శ్రీనివాస్ (వెల్ఫేర్), శేఖర్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంటులు, శంకర్, బషీర్, సి.సి.ఆర్.బి సిబ్బంది, ఐ.టి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లైంటు సెల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది హోమ్ గార్డ్స సిబ్బంది పాల్గొన్నారు.



## శివంపేటలో ఘనంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు!!



శివంపేట ఏప్రిల్ 5 (సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, సోంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, మరియు శివంపేటమండలంలోని వివిధ గ్రామాల తెరాస నాయకులు కార్యకర్తలు తదితరులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.





# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి

- * **ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో**
- * **ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు వివిధ పార్టీల నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.**
- * **బాబు జగ్జీవన్ రామ్ జీవితం, ఆదర్శప్రాయమని, వారు చేసిన సేవలు నేటి తరం పాటించాలని పిలుపునిచ్చారు.**

బోధన్, 5 ఏప్రిల్, సమయం న్యూస్ : భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవాలు బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తాలో గల విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, పట్టణ ACP శ్రీనివాస్, MRO విఠల్, పట్టణ CI వెంకట నారాయణ, MEO నాగనాథ్ వంటి అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు మందుగుల విద్యాసాగర్, ఉప్పల రామకృష్ణ, ఎదుల భూమయ్య, పాపారావు, ప్రొ. దేవయ్య, రాజమల్లేశం, పెద్దింటి సురేష్, బెల్లిడిగ సుధాకర్, కాల్ల మహేందర్, JAC కొండ్లెపు శంకర్, సింది శంకర్, అద్దంకి కృష్ణ, పల్లెపొగు రమణ, పిట్ల మహేష్, నాంపల్లి రాజు, చిన్న రాములు, పిట్ల అబ్బయ్య, సాయిలు, మెతరి రవి వంటి ప్రముఖులు కూడా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు పాషా మొయినొద్దిన్, తూము శరత్ రెడ్డి, VDC చైర్మన్ గంగాధర్ రావ్ పట్వారీ, మీర్ నజీర్ అలీ (డబ్బు), ప్రమోద్ కుమార్, గంగాధర్ గౌడ్, అంకు దామోదర్, కలీమ్, మీర్జాపురం బాలరాజు వంటి నాయకులు ఉత్సవాలలో పాల్గొన్నారు. అలాగే BRS పార్టీకి చెందిన నాయకులు గిర్దావార్ గంగారెడ్డి, గాండ్ల రవీందర్ యాదవ్, నక్క లింగారెడ్డి, బెంజర్ గంగారాం, శంకర్ గౌడ్, బిర్కూర్ బుజ్జి, SK జాకీర్ హైమద్, SK మొహమ్మద్ కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ జీవితం, ఆయన చేసిన సేవలు, ఆదర్శాలు గురించి పలువురు ప్రసంగాలు చేశారు. వారి ప్రసంగాల్లో ఆయన సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని స్మరించారు. ప్రజలను ఆయన ఆదర్శాలను పాటించమని పిలుపునిచ్చారు.



## పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం!

* **పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్ రామిరెడ్డి!!**

శివంపేట ఏప్రిల్ 5 ( సమయం న్యూస్) : శివంపేట్ మండల కేంద్రం లోని కొంతాన్ పల్లి, దంతాన్ పల్లి, గుండ్లపల్లి గ్రామాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాని శివంపేట్ మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి గ్రామస్తులకు సన్న బియ్యం పంపిణీ చేయడం చేశారు. అనంతరం పిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం అని అన్నారు. ఈకార్యక్రమంలో రేషన్ డీలర్స్, నాయకులు, యువకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ లో మున్సిపాలిటీ కార్మికుడిపై దాడి

: **పిర్యాదు నమోదు, దర్యాప్తు ప్రారంభం.**

బోధన్, 5 ఏప్రిల్ , సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్మికుడు వెండి అశోక్ కుమార్ తన చెత్త బండిని శనివారం రోజు బోధన్ లోని రాకాసిపేట RDO ఆఫీసు వెనుక గల్లీలో మజీద్ దగ్గరకు తీసుకువెళ్లినప్పుడు, గల్లీ వాసులు మహమ్మద్ ఖలిం, ఇమ్రాన్, షేక్ ఆహమ్మద్ లు అతన్ని తిట్టి, దాడి చేశారు. వారు వెండి అశోక్ ను చెత్త తీసుకువెళ్లడానికి అనుమతించక, అతని పై చేతులతో కొట్టి చంపుతామని బెదిరించారు. ఈ ఘటనపై వెండి అశోక్ కుమార్ పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులకు పిర్యాదు చేయగా ఇట్టి విషయమై సిఐ వెంకట్ నారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సి ఐ వెంకటనారాయణ తన పోలీసుల బృందం ఆధ్వర్యంలో ఘటనను పరిశీలించి, సాక్ష్యాలను సేకరిస్తున్నారు. ఈ దాడి మున్సిపాలిటీ కార్మికుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజలు ఈ అంశంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బోధన్ లో హనుమాన్ జయంతి బ్రహ్మోత్సవాల కరపత్రావిష్కరణ



బోధన్, 5 ఏప్రిల్, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని నర్సి రోడ్ ప్రాంగణంలో గల మారుతి మందిరం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశానుసారం మారుతి మందిరంలో హనుమాన్ జయంతి బ్రహ్మోత్సవాల కరపత్ర ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహక అధికారి నాయకం రాములు, దేవాలయ అధ్యక్షులు గుండెడి శంకర్, దేవాలయ ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్, కార్యవర్గ సభ్యులు బోధు శేఖర్, శంకర్ సుధాకర్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు. కరపత్రావిష్కరణ సందర్భంగా, చైత్ర పౌర్ణమి హనుమాన్ దినోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన 12వ తేదీ వరకు కొనసాగుతాయని, ఈ మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. కావున భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి స్వామివారి దివ్య ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు.




## నేడు శివంపేటలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుక.!

* **కోదండ రామస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు!!**

శివంపేట ఏప్రిల్ 5 (సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయ ప్రాంగణంలోసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుక జరుగుతుందని ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరుగుతుంది .కావున గ్రామ ప్రజలు మరియు భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని తిలకించి, ప్రసాదాలు స్వీకరించి శ్రీ కోదండ రామస్వామి ఆశీస్సులు పొందాలని కోదండ రామస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో డా.బాబు జగ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళి



హైదరాబాద్, ఏప్రిల్ 05: సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలిచిన భారత మహానాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని, శనివారం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... డా.బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమర యోధుడిగా సామాజిక సమానత్వానికి అంకితభావంతో పనిచేసిన గొప్పనేతయని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని, వారి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. డా.బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం నూతన భారత నిర్మాణంలో కీలకపాత్ర వహించారన్నారు. ఆయన వివిధ మంత్రిత్వ శాఖల్లో పలు బాధ్యతలు చేపట్టి ప్రజాసేవకు అంకితమయ్యారని, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో ఆయన పాత్ర అమూల్యమైనదని వారి సేవలను కొనియాడారు. డా. జగ్జీవన్ రామ్ ఆశయాలు, ఆలోచనలతో ఉద్యోగులు, యువత సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం పెంపొందేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు వేణు గోపాల్, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్, యాదగిరిరావు, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వ రెడ్డి, సిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, ఏ ఎం సి జీవన్ కుమార్, సూపరింటెండెంట్ సక్కుబాయి తదితరులు పాల్గొని డా.బాబు జాగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.



## సన్న బియ్యం పంపిణీ పేదవాడి పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

* జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ ఏప్రిల్ 05 (సమయం న్యూస్) : పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మెదక్. పాతూరు గ్రామంలో రేషన్ షాపులో రేషన్ కార్డు కలిగిన లబ్దిదారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవాడికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. మెదక్ జిల్లాలో 520 రేషన్ షాపుల ద్వారా 2,13,828 రేషన్ కార్డ్ దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం 4430.496 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరుగుతుందని దీని ద్వారా ఆరు లక్షల 96 వేల 43 మంది సభ్యులకు సన్న బియ్యం పంపిణీ ద్వారా లబ్ధి చేకూరనుందని తెలిపారు. జిల్లాలో 100 శాతం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నేటి యువతకు బాబూ జగజ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం కావాలి : కలెక్టర్

* అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్
* సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన నేతగా బాబు జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం
* మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ఏప్రిల్06 (సమయం న్యూస్): నేటి యువతకు బాబూ జగజ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డా.బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకల సందర్భంగా, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, డిఆర్ఓ భుజంగరావు, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ ,టీఎన్జీవోస్ అధ్యక్షులు నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, వివిధ దళిత సంఘం,కుల సంఘాల నాయకులుతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతర భారత నిర్మాణంలో అపూర్వమైన సేవలు అందించిన అందించిన మహనీయుడని అన్నారు. ఆయన అత్యంత కాలం కేబినెట్ మంత్రిగా కొనసాగిన ఘనత గల నేత మాత్రమే కాకుండా, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి గా,కార్మిక శాఖ మంత్రిగా, వ్యవసాయ మంత్రిగా, రక్షణ మంత్రిగా వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. వ్యవసాయ మంత్రిగా పనిచేసి గ్రీన్ రివల్యూషన్‌ను సమర్థవంతంగా అమలు చేసి దేశాన్ని ఆహార ధాన్యాల పరంగా స్వయం సమృద్ధిగా మార్చిన వారని పేర్కొన్నారు.రక్షణ మంత్రిగా ఇండో పాక్ యుద్ధ సమయంలో భారతదేశానికి విజయాన్ని సాధించిపెట్టడంలో ఆయన నాయకత్వం విశేషమని, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యంలో ఆయన పాత్రను మరువలేమని అన్నారు. సామాజిక విప్లవానికి ఆయన చేసిన కృషి అపూర్వమని, డా.బి.ఆర్.అంబేద్కర్ గారి తీరునే ఆయన కూడా అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని తెలిపారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు చేసిన కృషి సమాజానికి దిశానిర్దేశకంగా నిలిచాయని అన్నారు. అభిప్రాయపడ్డారు. నేటి యువత ఆయన జీవితం నుండి ప్రేరణ పొందాలాని, ఆయన ఆదర్శాలను అనుసరించాలని కలెక్టర్ అన్నారు. మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రతిపాదించిన ప్రకారం అంబేద్కర్ అనగానే గుర్తుకు వచ్చేది పార్లమెంట్ జిల్లా కూడలిలో ఒక గద్దె లాగా ఏర్పాటు చేసుకుని దానిపై అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వారి సూచన ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మెదక్ పట్టణంలో అంబేద్కర్ భవన్ గురించి దళిత సంఘం నాయకులు అభ్యర్థనను స్వీకరించడం జరిగిందని ఇంతకుముందు జిల్లాలో అంబేద్కర్ భవన్ శాంక్షన్ అయిందని ఏ కారణం చేతనో. మధ్యలోనే ఆగిపోవడం జరిగిందని, స్థానిక తాసిల్దార్ ద్వారా భూమిని గుర్తించే పనిలో ఉన్నామని త్వరలోనే ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా లెటర్ పెట్టమని చెప్పడం జరిగిందని తొందరలో అనుమతులు మంజూరు చేయించుకుని అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు . ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లతో విద్యలో రాణించాలని, విద్యతోనే ఏదైనా సాధ్యపడుతుందని ఆనాడే ఆలోచించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు సంజీవ్, దళిత సంఘాల నాయకులు దయాసాగర్, మురళి, నస్కల్ సంజీవ్, శ్రీనివాస్ ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు



## పోషకాహార లోపం తో ఉన్నపిల్లల పై ప్రత్యేజ దృష్టి సారించండి

* మహిళ శిశు సంక్షేమ కార్యదర్శి అనిత రామచంద్రన్

హైదరాబాద్ ఎప్రిల్ 05 (సమయం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో పోషకాహార లోపాన్ని తగ్గించడం పై బ్రెయిన్ స్టోర్మింగ్ సెషన్ సమావేశాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ గారి అద్వర్యంలో హైద్రాబాద్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సంగారెడ్డి జిల్లా నుండి జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి K. లలిత కుమారి , సి.డి.పి.ఓ చంద్రకళ హాజరవడం జరిగింది. రాష్ట్రస్థాయిలో పోషకాహార లోపంతో వున్న పిల్లలపై దృష్టి సారించాలని ఈ సమావేశం నిర్వహించడం జరిగింది.స్వయం సహాయక బృందాలు, ఆరోగ్య సిబ్బంది ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు అందరూ కలిసి గ్రామ స్థాయిలో సందర్శనలు చేయాలి అని మరియు ఎత్తుకు తగిన బరువు లేని(సామ్ , మామ్) పిల్లలు , గర్భిణీ,బాలింతలకు గృహ సందర్శనకు చేసి బలోపేతం చేయాలి అని తెలంగాణ రాష్ట్రం మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలియజేశారు. సేంద్రియ ఎరువలతో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ కూడా బలోపేతం చేయాలి అని చెప్పడం జరిగింది.ప్రతి నెల జరిగే VHSND (విలేజ్ హెల్త్ అండ్ శానిటేషన్, న్యూట్రిషన్ డే) ప్రోగ్రాం లో కూడా ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు అన్ని శాఖల ఆధ్వర్యంలో లో అందరి సహకారం తో ముందుకు వెళ్తే ఎవరైతే అంగన్వాడికి రానీ పిల్లలను గుర్తించి వారినీ కూడా గృహ సందర్శనలు చేసి బలోపేతం చేయడమే కాకుండా గర్భిణీలు బాలింతలల్లో పోషకాహార లోపంని తగ్గించవచ్చని సూచించారు. పోషకాహార లోపాన్ని నిర్మూలించడానికి అన్ని శాఖల సమన్వయంతో గ్రామ స్థాయిలో ఈ సందేశాన్ని అందించాల్సిందిగా ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. తెలంగాణ రాష్ట్రంలో పోషకాహార లోపం తగ్గించడంపై జిల్లా మరియు గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని ఈ సమావేశంలో సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతి అంగన్వాడి సెంటర్ పరిధిలో పోషకాహార లోపం వున్న పిల్లలపై , గర్భిణులు, బాలింతల పై ప్రత్యేక శ్రద్ధ వహించి , వారి ఆరోగ్యం పట్ల మరియు జిల్లాలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడానికి కృషి చేస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి K. లలిత కుమారి తెలిపారు

# ఘనంగా బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలు

నిజామాబాద్, ఏప్రిల్ 05 :(సమయం న్యూస్) భారత మాజీ ఉపప్రదాని డాక్టర్ బాబు జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంటేశ్వర్ కమాన్ వద్ద గల పాత అంబేడ్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత అంబేడ్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రాం చేసిన సేవలను కొనియాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రత్యేకించి యువతరం, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రాం అందించిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. మహనీయుల గొప్పతనాన్ని, వారు చేసిన కృషిని భావితరాలకు తెలియజేస్తూ, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం అధికారకంగా నిర్వహిస్తున్న జయంతి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే వంటి మహనీయుల కృషి ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, నేడు మనమంతా గౌరవప్రదమైన స్థితిలో జీవనాలు వెళ్లదీస్తున్నామని కలెక్టర్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని, తాను చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. మహనీయుల గురించి తెలుసుకొని, వారి అడుగుజాడల్లో నడిచేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు 5800 యూనిట్లు కేటాయించారని అన్నారు. అర్హులైన ఎస్సీ యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని దళిత సంఘాల ప్రతినిధులకు సూచించారు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా, మరికొందరికి ఉపాధి కల్పించవచ్చని అన్నారు. జిల్లాలో వివిధ కుల సంఘాల వారు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అంకిత భావంతో కృషి చేస్తుందని భరోసా కల్పించారు. ఏ సమస్య ఉన్నా, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తేవాలని సూచించారు. దళిత సంఘాలు ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తున్న పాత అంబేడ్కర్ భవనం మరమ్మతులకు వారం రోజుల్లోనే రూ. 5 లక్షల నిధులు విడుదల చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా వచ్చే సంవత్సరం జయంతి నాటికి ఈ భవనాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లు మాట్లాడుతూ, దేశానికి ఎన్నో విధాలుగా సేవలందించిన మహనీయుడు బాబు జగ్జీవన్ రాం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన బాబు జగ్జీవన్ రాం బడుగు, బలహీన వర్గాలు రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో పయనించాలనే సంకల్పంతో అహరహం శ్రమించారని అన్నారు. జగ్జీవన్ రాం ఏ ఒక్క కులానికో, వర్గానికో చెందిన వ్యక్తి కాదని, సమాజంలో సమానత్వం కోసం పరితపించిన మహనీయుడని కొనియాడారు. జయంతి కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.



## పోలీస్ కమిషనరేట్ లో డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు




హన్మకొండ ఏప్రిల్ 05( సమయం న్యూస్) : డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిధి గా హాజరై బాబు జగ్జీవన్ రామ్ పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం తపించిన బాబు జగ్జీవన్ రాం విద్యార్థి దశ నుంచే కుల వివక్షపై పోరాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, స్వాతంత్ర్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని,ఆయన దళితుల అభ్యున్నతికి, సామాజిక సమానత్వం కోసం పోరాడారని సీపీ తెలిపారు.బాబు జగ్జీవన్ రామ్ కి నివాళులు అర్పించిన వారిలో డీసీపీలు షేక్,సలీమా, అంకిత్ కుమార్, అదనపు డీసీపీ రవి కుమార్ తో పాటు ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్. ఐలు ఇతర పోలీస్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి అందరికీ స్ఫూర్తి

* జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్




నిర్మల్ ఏప్రిల్05 (సమయం న్యూస్): సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన డా. బాబు జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలలో అధికారులు, నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని జిల్లా స్థాయిలో అధికారికంగా నిర్వహిస్తూ, మహనీయుడి సేవలను స్మరించుకోవడం మనందరికీ గర్వకారణం అని తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశానికి ఒక దీపస్తంభంలా నిలిచారని, సామాజిక సమానత్వానికి, దళితుల హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం చారిత్రాత్మకమైనదని తెలిపారు. భారత ఉప ప్రధాన మంత్రిగా, కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖ మంత్రిగా వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో, నిరంకుశ భేదాభిప్రాయాలను ఎదుర్కొంటూ, విద్య, విజ్ఞానం, విలువలతో ఆయన ఎదిగిన విధానం నేటి యువతకు ఒక ప్రేరణగా నిలుస్తుందన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు చేసిన కృషి సమాజానికి దిశానిర్దేశకంగా నిలిచా యని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన నేతగా బాబు జగ్జీవన్ రామ్ భారత చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. నేటి యువత జగ్జీవన్ రామ్ జీవితం నుండి ప్రేరణ పొందాలాని, ఆయన ఆదర్శాలను అనుసరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్, సిబ్బంది, దళిత సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి కడుపు నింపేందుకు
# తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయం "సన్న బియ్యం పంపిణీ"

* **జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

ఆసిఫాబాద్ ఏప్రిల్ 5, (సమయం న్యూస్) ; పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ పునరావాస కాలనీలో రేషన్ కార్డు లబ్ధిదారుడు తాక్సండే శంకర్ ఇంట్లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వం ఉచితంగా అందించిన సన్నబియ్యంతో తయారు చేసిన భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవాడికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ లో ఆదేశించిన ప్రకారంగా జిల్లాలో మొత్తం 314 చౌక ధరల దుకాణాల ద్వారా 3 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రత్యేక అధికారులు జిల్లాలోని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. జిల్లాలో 100 శాతం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారుడు తాక్సండే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం, జిల్లా కలెక్టర్ తన ఇంట్లో భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇంతకు ముందు కిరాణా దుకాణాలలో సన్న బియ్యం కొనుగోలు చేసేవారని, ఇప్పుడు ఖరీదు చేసే అవసరం లేకుండా ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రోహిత్ కుమార్, సంబంధిత అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహాల్ని ఘనా నివాళి అర్పించిన ముఖ్య మంత్రి ఉప ముఖ్య మంత్రి వర్యులు

హైదరాబాద్ ఎప్రిల్ 05 (సమయం న్యూస్) : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకల సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి లతో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ తాటికొండ రాజయ్య, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్, మాజీ రాజ్య సభ సభ్యులు హనుమంత రావు, కార్పొరేషన్ల చైర్మన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వివిధ కుల సంఘాలు, నాయకులు తదితరులున్నారు.



## రోడ్డు వెడల్పు లో అంబేద్కర్ విగ్రహం తొలగింపు ఉండదు

- **స్థానిక సంస్థల అదనప కలెక్టర్ & రామగుండం ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ జే.అరుణశ్రీ**

పెద్దపల్లి , ఏప్రిల్ 05: (సమయం న్యూస్) : రామగుండం (గోదావరిఖని) రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం తొలగింపు ఉండదని స్థానిక సంస్థల అదనప కలెక్టర్ & రామగుండం ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ జే.అరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గోదావరిఖని బస్టాండ్ చౌరస్తాలో రోడ్డు వెడల్పులో అంబేద్కర్ విగ్రహం తొలగిస్తారని కొందరు అపోహలు సృష్టిస్తున్నారని, ప్రజలు ఎవరు ఇటువంటి అపోహలను నమ్మవద్దని, రోడ్డు వెడల్పులో విగ్రహాల తొలగింపు ఎట్టి పరిస్థితుల్లో ఉండదని, ప్రజలు అనవసర ఆందోళనకు గురి కావద్దని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## డాక్టర్ బాబు జాగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
* **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**

భూపాల్ పల్లి ఏప్రిల్05(సమయం న్యూస్) : డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన డా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొని డా బాబు జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ చిట్ట చివరి పేద కుటుంబం వరకు సంక్షేమ పథకాలు చేరేవిధంగా అధికారులు పని చేసినప్పుడే మహనీయుల ఆశయాలను సాధించిన వారమవుతామని తెలిపారు. విద్యనభ్యసించడం వల్ల ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పు వస్తుందనడానికి డా బాబు జగ్జీవన్ రామ్ జీవితం నిదర్శనమని అన్నారు.



బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం, కలకత్తా విశ్వ విద్యాలయంలో జగ్జీవన్ రామ్ విద్యనభ్యసించారని, 1936 సంవత్సరం నుండి 1986 వరకు దాదాపు 50 సంవత్సరాలు సీనియర్ పార్లమెంటేరియన్ గా పనిచేసిన ఏకైక వ్యక్తి జగ్జీవన్ రామ్ అన్నారు. 1946లో జగ్జీవన్ రామ్ నాటి జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజాసేవలో ప్రజల మన్ననలు పొందారని అన్నారు. భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ లో కార్మికమంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడుగా సామాజిక న్యాయాన్ని రాజ్యాంగంలో పొందుపరచబడిందని అన్నారు. 45 సంవత్సరాలకు పైగా వివిధ శాఖల కేంద్ర మంత్రిగా పనిచేశారని, ముఖ్యంగా జగ్జివన్ రామ్ 1971 ఇండో పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా ఉన్నారని తెలిపారు. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో అతను అందించిన సహకారం, కేంద్ర వ్యవసాయ మంత్రిగా తన రెండు పదవీ కాలాల్లో 1974 కరువు సమయంలో, ఆహార సంక్షోభాన్ని నివారించడానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినప్పుడు అంగీకారం తెలపడం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయమని అన్నారు. నేటితరం యువతకు డా బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శమని యువత ఆయన బాటలో పయనించి మన జిల్లాకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిదని అన్నారు.ాబు జగ్జీవన్ రామ్ ఆచరణలో సామాజిక స్ఫూర్తిని నాటిన మహానాయకుడిగా గుర్తు చేశారు. ఆయన సేవలు ప్రతి ఒక్క భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఎస్సి అభివృద్ధి అధికారి సునీత, డిఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, డిఎస్పీ సంపత్ రావు, వివిధ కులసంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం

అమరావతి రాజధాని నిర్మాణం కోసం అవసరమైన మిగిలిన నిధులు వివిధ రూపాల్లో సమీకరించేందుకు సీఆర్డీఏ కమిషనర్ కు అనుమతిస్తూ అథారిటీ నిర్ణయం. పనులను ఎప్పటి కప్పుడు పూర్తి చేసేలా మిగిలిన అవసరమైన నిధులను వివిధ ఫైనాన్సియల్ ఇన్ స్టిట్యూషన్స్ నుంచి సమీకరించేందుకు సీఆర్డీఏ కమిషనర్ కు అనుమతి. అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం తెలిపిన అథారిటీ.ఎల్ వన్ గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు ఆమోదముద్ర. అసెంబ్లీ బేస్ మెంట్ + జీ + 3 + వ్యూయింగ్ ప్లాట్ ఫాంలు + పనోరమిక్ వ్యూ(బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు,ఎత్తు 250 మీటర్లు). అసెంబ్లీ నిర్మాణానికి టెండర్‌యలో ఎల్ వన్ గా నిలిచిన సంస్థ కు LOA



ఇచ్చేందుకు ఆమోదం. హైకోర్టు బేస్ మెంట్ + జీ + 7 అంస్తుల్లో నిర్మాణం. బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు..ఎత్తు 55 మీటర్లు...ఎల్ వన్ గా నిలిచిన సంస్థకు LOA ఇచ్చేందుకు ఆమోదం.

# సన్న బియ్యం పంపిణీ దేశానికి ఆదర్శం

* **చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పథకం సన్న బియ్యం పంపిణీ పథకం**
* **ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలకు పెద్దపీట**
* **పేద ప్రజల పక్షాన నిలిచే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం**
* **వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలుచౌక ధరల దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి**
* **బల్దియా ఆధ్వర్యంలో రూ. 62 లక్షలతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీమతి కొండా సురేఖ**



వరంగల్; 5 ఏప్రిల్ 2025 : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికి ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం జిడబ్ల్యూఎంసీ పరిధిలోని 27వ డివిజన్ గోవిందరాజులగుట్ట, 32వ డివిజన్ లోని ఎస్ ఆర్ ఆర్ తోట, 37 డివిజన్ తూర్పు కోట కొత్త గడ్డ, 18వ డివిజన్ లేబర్ కాలనీ గాంధీనగర్ చౌక ధరల దుకాణాలలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మంత్రి శ్రీమతి కొండా సురేఖ, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే లతో కలసి ప్రారంభించి లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బల్దియా ఆధ్వర్యంలో పలు పథకాల క్రింద రూ 62 లక్షల వ్యయంతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బల్దియా పరిధిలోని 27 వ డివిజన్ డివిజన్లో 30 లక్షల రూపాయల వ్యయంతో బల్దియా జనరల్ ఫండ్ నిధులతో నిర్మించే లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ ఓపెన్ షెడ్ పనులకు, 26వ డివిజన్ సిఖ్ వాడాలో బల్లియా ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించే సిఖ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు, 42 వ డివిజన్ రంగశాయిపేట లెనిన్ నగర్ లో 22 లక్షల రూపాయల స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీమతి కొండా సురేఖ, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత కార్పొరేటర్లతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందని లబ్ధిదారులు కూడా దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిని నేడు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో ప్రతి లబ్ధిదారుడు సన్నబియాన్నే వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసినట్లు అయిందని మంత్రి సురేఖ తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలతో అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు మంత్రులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, రైతు భరోసా కింద 12 వేల కోట్ల రూపాయలు మొత్తం 15 నెలల్లో 33 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేసి రైతుల గుండెల్లో ఇందిరా గాంధీ సోనియా గాంధీ ల పేర్లు శాశ్వతంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకం శాశ్వతంగా నిలిచిపోయే పథకం అన్నారు. వరంగల్ జిల్లాలో 509 రేషన్ షాపుల ద్వారా 2 లక్షల 66 వేల 429 తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ప్రతి నెల 50 వేల 145 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ లు చింతాకుల అనిల్ కుమార్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, భోగి సువర్ణ, వస్కుల బాబు, పోశాల పద్మ బాల్నే సురేష్, చింతాకుల అనిల్ కుమార్,గుండు చందన పూర్ణ చందర్,, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, పోరా సరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# షైన్ తగ్గుతున్న చెన్నై సూపర్ కింగ్స్.. వరుస ఓటములకు 5 కారణాలు



**ఓపెనర్లు.. పవర్ ప్లే..**

టీ20 క్రికెట్‌లో పవర్ ప్లే చాలా ముఖ్యం అని చెబుతారు. తొలి ఆరు ఓవర్లలో వీలైనన్ని పరుగులు రాబట్టాలి. అలాంటిది చెన్నైకి ఈ సారి ఓపెనర్లు ఎవరు అనేది ఇంకా తేలడం లేదు. ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచుల్లో మూడు ఓపెనింగ్ జోడీలను ట్రై చేశారు. అయితే ఈ ప్రయత్నాలన్నీ విఫలమవ్వడం తలనొప్పిగా మారింది. తొలి రెండు మ్యాచుల్లో రాహుల్ త్రిపాఠి (2, 5) తీవ్రంగా నిరాశపరిచాడు. మూడో మ్యాచులో 23 కొట్టాడు.. కానీ స్ట్రైక్ రేట్ టీ20ల స్థాయిలో లేదు. నాలుగో మ్యాచులో త్రిపాఠిని పక్కన పెట్టి డేవాన్ కాన్వేను తీసుకొచ్చారు. అతను ఫెయిల్ అవ్వగా.. తొలి రెండు మ్యాచుల్లో రాణించిన రచిన్ (65, 41) దిల్లీ మ్యాచులో నిరాశపరిచాడు. దీంతో ఓపెనర్ల కష్టం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. సరైన ఓపెనర్లు లేకుండా భారీ స్కోరు, ఛేజింగ్ అసాధ్యం. అందుకే ఈ సీజన్‌లో అతి తక్కువ పవర్ ప్లే స్కోరు, స్ట్రైక్ రేటు ఉన్న చెన్నైకే. ఇదే విషయమై కెప్టెన్ రుతురాజ్ మాట్లాడుతూ 'ఈ సమస్యను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాం. వర్కవుట్ అవ్వడం లేదు' అని ఒప్పుకున్నాడు కూడా.

**దూబె మీదే భారమా?**

ఓపెనర్లు రాణించకపోయినా.. మిడిలార్డర్‌తో కవర్ చేద్దామన్నా చెన్నైకి వీలవడం లేదు. గతంలో ఎన్నో మంచి విజయాలు, ఇన్నింగ్స్‌లు అందించిన అజింక్య రహానె, డారిల్ మిచెల్‌ను జట్టు బాగా మిస్ అవుతోంది. దీంతో శివమ్ దూబె మీద మొత్తంగా ఆధారపడాల్సి వస్తోంది. అయితే దూబె (9, 19, 9, 18) కూడా ఓపెనర్లను అనుసరిస్తూ వేగంగా పెవిలియన్‌కు వెళ్లిపోతున్నాడు. గత నాలుగు మ్యాచుల్లో మిడిలార్డర్‌లో ట్రై చేసిన దీపక్ హుడా, సామ్ కరన్, విజయ్ శంకర్ విఫలమయ్యారు. దిల్లీ మ్యాచులో విజయ్ శంకర్ ఆడినా.. స్ట్రైక్ రేట్ చెన్నై పాలిట విలన్ అయింది. ఇక మొదటి రెండు మ్యాచుల్లో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో విమర్శలు రావడంతో గత రెండు మ్యాచుల్లో ముందుకొచ్చాడు. అయితే జట్టుకు అవసరమైన పరుగులు వేగంగా చేయలేకపోయాడు. ఇక రవీంద్ర జడేజా పరిస్థితి కూడా దాదాపు ఇంతే.

**బౌలింగ్ మారాల్సిందే...**

బౌలింగ్ విషయంలో చెన్నై ఈ ఏడాది పెద్ద సమస్యలే ఎదుర్కొంటోంది. చెన్నై పిచ్‌ల మీద మాయ చేస్తాడనుకున్న రవిచంద్రన్ అశ్విన్ ఆ స్థాయి ప్రదర్శన అయితే చేయడం లేదు. ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు వికెట్లే తీశాడు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు భారీగా పరుగులు కూడా ఇచ్చేస్తున్నాడు. ఇక జడేజా పరిస్థితి కూడా దాదాపు ఇంతే. అన్ని మ్యాచులు ఆడి రెండు వికెట్లే తీశాడు. నూర్ అహ్మద్ (10 వికెట్లు) అదరగొట్టకపోతే స్పిన్నే ఆయుధంగా బరిలోకి దిగే చెన్నై పరిస్థితి ఇంకా దారుణంగా ఉండేది. ఇక పేసర్ల విషయం చూస్తే.. ఎప్పటిలాగే మతీశా పతిరన (5 వికెట్లు) తన వేగంగా అదరగొడుతున్నాడు. మిడిల్ ఓవర్‌లో కాస్త ఎక్కువ పరుగులు ఇచ్చినా.. ఎప్పటిలానే డెత్ ఓవర్లలో బాగానే కట్టడి చేస్తున్నాడు. ఇక పవర్ ప్లేలో ఖలీల్ అహ్మద్ (8) బాగా బౌలింగ్ చేస్తున్నాడు.

# MOVIE TIME






## ఆ వార్తలు చదివి కన్నీళ్లు పెట్టుకున్నా : తమన్నా

'చాంద్ సా రోషన్ చెహ్రా' (2005)తో నటిగా తెరంగేట్రం చేశారు తమన్నా. సుమారు 20 ఏళ్ల సినీ కెరీర్‌లో వివిధ భాషల్లో ఆమె ఎన్నో చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఓదెల 2' రిలీజ్‌కు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె కెరీర్‌పై వ్యాఖ్యలు చేశారు. యాక్టింగ్‌ను తాను కేవలం వృత్తిగానే చూడలేదని వెల్లడించారు. ఎప్పుడూ దానిని కష్టం అనుకోలేదన్నారు. ప్రతి విషయాన్ని తాను ఎంజాయ్ చేశానని వివరించారు. "పదో తరగతిలో ఉన్నప్పుడే నేను ఇండస్ట్రీలోకి వచ్చా. చదువుల్లో టీచర్లు నాకెంతో సాయం చేసేవారు. ఒక్కోసారి వాళ్లే నా అసైన్‌మెంట్స్ పూర్తి చేసేవారు. వారికి ఎప్పుడూ కృతజ్ఞురాలినే. నిజ జీవితంలో నేను కాలేజీకి వెళ్లలేదు. కానీ, రీల్ లైఫ్‌లో మాత్రం కాలేజీ స్టూడెంట్‌గా నటించా. సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి అప్పుడే 20 ఏళ్లు అవుతోంది. అందుకు ఎంతో ఆనందంగా ఉంది. కెరీర్ ఆరంభించినప్పుడు ఇన్నేళ్లు ఉంటానని అనుకోలేదు" "నా 21వ పుట్టినరోజు నాడు జరిగిన ఒక సంఘటన ఏమాత్రం మర్చిపోలేను. పుట్టినరోజు సందర్భంగా షూటింగ్స్ నుంచి బ్రేక్ తీసుకుని ఇంట్లోనే ఉన్నా. అప్పుడు నాపై పత్రికల్లో ఒక ప్రత్యేక కథనం వచ్చింది. 'తమిళంలో నంబర్ 1 నటి' అనేది అందులోని సారాంశం. అది చదువుతూ నేను కన్నీళ్లు పెట్టేసుకున్నా. త్వరగా ఆ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. నంబర్ 1 స్థానానికి వెళ్లాక.. అక్కడే కొనసాగడం అంత సులభం కాదనిపించింది. అదొక బాధ్యతగా తీసుకున్నా. ప్రేక్షకులను అలరించే విధంగా సినిమాలు చేయాలని అనుకున్నా. ఈ స్థాయికి చేరుకున్నా" అని ఆమె వివరించారు.





## అవార్డులు పనికిరావు

బాలీవుడ్ హీరోయిన్, ఎంపీ కంగనా రనౌత్ లీడ్‌రోల్‌లో నటించి, స్వీయదర్శకత్వం వహించిన మూవీ ఎమర్జెన్సీ. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పడే, విశాక్ నాయర్, మిలింద్ సోమన్ సహా దివంగత నటుడు సతీశ్ కౌశిక్ కీలక పాత్రల్లో నటించారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని కంగనానే నిర్మించారు. పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిన ఈ మూవీ జనవరి 17న థియేటర్ లోకి వచ్చింది. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం చివరకు ఆశించిన ఫలితాలను రాకపోవడంతో గతనెల 14 నుంచే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ప్రస్తుతం ఓటీటీ వేదికగా అందుబాటులో ఉన్న ఈ చిత్రంపై నిత్యానందం అనే వ్యక్తి ప్రశంసల వర్షం కురిపించాడు. ఇలాంటి పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌ను ఎలాంటి బెరుకు లేకుండా రూపొందించిన కంగనను మెచ్చుకున్నాడు. ఇదే విషయాన్ని తాజాగా ఇన్‌స్టా వేదికగా ప్రేక్షకులతో పంచుకుంది. అతడు రాసిన లేఖను ఇన్‌స్టా వేదికగా షేర్ చేసిన కంగన.. తాను తెరకెక్కించిన 'ఎమర్జెన్సీ'కి గాను కాంచీవరం సిల్క్‌చీర బహుమతిగా పంపినట్లు వెల్లడించింది. ఆ గిఫ్ట్ తనకు ఎంతో విలువైందని పేర్కొంది. అటు బాలీవుడ్ అవార్డుల కార్యక్రమాలపై అసహనం వ్యక్తం చేసింది. పనికిమాలిన అవార్డుల కంటే ఈ చీర ఎంతో విలువైందని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది.



## 'జాక్'.. టైటిల్ ఎందుకు పెట్టామంటే!: సిద్ధూ జొన్నలగడ్డ

సిద్ధూ జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'జాక్' (Jack). 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్‌లైన్. బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కించారు. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. అందులో భాగంగా శనివారం విజయవాడలో సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిద్ధూ జొన్నలగడ్డ మాట్లాడారు.

## బాలీవుడ్ ఎంట్రీకి డేట్ ఫిక్స్



యంగ్‌టైగర్ జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీకి డేట్ ఫిక్సయింది. ఆయన నటిస్తున్న వార్ 2 సినిమా విడుదల తేదీని బాలీవుడ్ గ్రీకువీరుడు హృతిక్ రోషన్ ప్రకటించాడు. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న తాజా మూవీ వార్ 2. ఇందులో తారక్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. జాన్ అబ్రహాం, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వార్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆదిత్య చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ మూవీ విడుదల తేదీ ఎప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించాడు హృతిక్ రోషన్. ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు తెలిపాడు. కాగా.. హృతిక్ రోషన్ తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొని వార్ 2 గురించి, ఎన్టీఆర్‌తో పని చేయడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఎన్టీఆర్‌ఓ అద్భుతం. ఆయన మంచి కో యాక్టర్, అమేజింగ్ టీమ్ మేట్. మేం ఇద్దరం కలిసి వార్ 2 చేశాం.. మేం చేసిన అద్భుతాన్ని అందరూ చూడాలని ఎంతో ఎగ్జైటింగ్‌గా వెయిట్ చేస్తున్నాను. ఒక పాట మినహా షూటింగ్ అంతా పూర్తయ్యింది. మా సినిమా అద్భుతంగా వచ్చింది. ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది. దీనికోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఎన్టీఆర్‌తో చేయాలంటే కాస్త నర్వెస్‌గా ఫీల్ అవుతున్నా' అని అన్నాడు. దీంతో ఆ వేదికంతా కేరింతలతో మారుమోగింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతోంది.

## డార్క్ షేడ్ సో క్యూట్

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్‌తో దక్షిణాది ప్రేక్షకులకు ఇష్టమైన నటిగా మారింది అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై సందడి చేసిన ఈఅమ్మడు.. ఇప్పుడు సిల్వర్‌స్క్రీన్‌పై అలరించింది. ఉయ్యాల జంపాల సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి ఫస్ట్ మూవీతోనే హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆతర్వాత సినిమా చూపిస్త మావతో హిట్అందుకుంది. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించిన అవికా.. హిందీ సినిమాల్లోనూ చాన్స్‌కొట్టేసింది. అయితే హీరోయిన్‌గా అవికా గోర్ కొన్నాళ్ల పాటు బిజీగా ఉన్నప్పటికీ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. అంతే కాకుండా కొన్ని అనవసర ఎంపికల కారణంగా ఇండస్ట్రీలో ఈబ్యూటీ క్రేజ్ తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యూలర్‌గా ఫొటోలు షేర్‌చేస్తూ అభిమానులతో టచ్‌లోనే ఉంటోంది. తాజాగా ఈ భామ పోస్ట్‌చేసిన పిక్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డార్క్ షేడ్ ఔట్ ఫిట్‌తో అవికా అందాలతో మెస్మరైజ్‌చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సో క్యూట్, బ్యూటిఫుల్ అంటూ ఫ్యాన్స్ పోస్టులుపెడుతున్నారు. అందానికి తగ్గట్లు ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు రాకపోవడం దారుణం అని, ముందు ముందు అయినా ఈబ్యూటీకి ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD.
PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.